7

సాక్షి అనకాపల్లి

మంగళవారం । 26 । ఆగస్టు । 2025

నోరూరించే బొజ్జ గణపయ్య

18 రకాల పప్పు దినుసులతో రూపకల్పన

నర్సీపట్నం: శాంతినగర్‌లో వినాయక చవితి వేడుకలకు పప్పు దినుసులతో తయారు చేసిన గణపతి ప్రతిమ సిద్ధమైంది. శిల్ప కళాకారులైన తండ్రి, కొడుకులు వి.నూకరాజు, వాసు పర్యావరణ హితం కోరుతూ 18 ఏళ్లుగా అనేక రూపాల్లో విగ్రహాలను తయారు చేసి అందరి మన్ననలు పొందుతున్నారు. ఈ ఏడాది 15 రోజులు శ్రమించి, సుమారు రూ.10 వేల వ్యయంతో మూడున్నర అడుగుల మట్టి విగ్రహాన్ని తయారు చేశారు. ఆ విగ్రహాన్ని 18 రకాల పప్పుదినుసులతో అలంకరించారు. గుమ్మిడి గింజలు, సోయాబీన్స్, ఎర్ర కందిపప్పు, ఉలవలు, శనగపప్పు, ధనియాలు, శనగలు, సోంపు, బాదంపప్పు, సగ్గుబియ్యం, అనాసపువ్వు, డబల్ బీన్స్, ఆవాలు, గసగసాలు, సజ్జా గింజలు, దోసపప్పులతో తీర్చిదిద్ది, పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు.



న్యూస్‌రీల్

'ఇన్‌స్పైర్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి తదితరులు

అనకాపల్లి టౌన్: విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేందుకు దోహదపడే ఇన్‌స్పైర్ మనక్ (2025–26) పోస్టర్‌ను కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఇతర అధికారులు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో ఉండే ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగపడే ఇన్‌స్పైర్ నామినేషన్లను ప్రతి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుంచి ఎక్కువ సంఖ్యలో వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. 2022–23 సంవత్సరంలో 1300 ప్రాజెక్టులకు గాను జిల్లా నుంచి 126 ఎంపికవ్వగా అందులో రాష్ట్ర స్థాయిలో 13, జాతీయ స్థాయిలోనూ ఒకటి బహుమతులు సాధించాయన్నారు. 2023–24లో 1330 ప్రాజెక్టులకు గాను జిల్లా స్థాయిలో 135 ప్రాజెక్టులు, 2024–25లో 1550 ప్రాజెక్టులకు గాను జిల్లా స్థాయిలో 151 ప్రాజెక్టులు ఎంపికయినట్లు తెలిపారు. రీసోర్స్ పర్సన్ ఎస్.బాబూరావు, జిల్లా సైన్స్ అధికారి డి.కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మహిళా బాక్సర్లు



బాక్సర్లు తేజస్విని, మౌనిక

నర్సీపట్నం: ఈ నెల 26న తిరుపతిలో జరగనున్న అమరావతి చాంపియన్ షిప్ కప్–2025 రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన యర్రా తేజస్విని, బొంతు మౌనిక పాల్గొంటున్నారు. వీరు ఇటీవల జరిగిన విశాఖ జోనల్–1 స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి కోచ్‌గా వేపాడ ప్రియాంక వ్యవహరిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు వెదురుపర్తి విద్యార్థినులు



శ్రీజిత, హాసినిలతో ఉపాధ్యాయులు

కోటకోట: వెదురుపర్తి హైస్కూలుకు చెందిన ఇద్దరు బాలికలు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల లంకెలపాలెంలో జిల్లా స్థాయిలో టీం సెలక్షన్స్ జరిగాయి. దీనిలో జూనియర్ విభాగంలో హైస్కూలుకు చెందిన ఎస్.శ్రీజిత, కె.హాసిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం కె.ఆర్.ఎస్.ఎన్.నాయుడు, పీడీ ఎ.నూకరాజు సోమవారం తెలిపారు. వీరు వచ్చే నెలలో ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది వీరికి అభినందనలు తెలిపారు.



అర్జీదారులకు అగచాట్లు



ఎన్నిసార్లు తిరిగినా తీరని ఇక్కట్లు

అది భరోసా ఇవ్వాల్సిన వేదిక.. మేమున్నామంటూ ధైర్యం చెప్పాల్సిన అత్యున్నత స్థానం.. అధికార యంత్రాంగంలో అలసత్వాన్ని తొలగించి, అభాగ్యులకు న్యాయం చేయాల్సిన మానవతా పీఠం. కలెక్టరేట్‌కు వస్తే తమ కష్టం తీరుతుందన్న నమ్మకం ఇవ్వగలగాలి. నియమ నిబంధనలు పాటిస్తూనే ఒక్కోసారి అందుకు అతీతంగా నిర్ణయాలు తీసుకొని, అల్పజీవులను ఆదుకోవాలి. కలెక్టరేట్‌కు వస్తున్న ప్రజల్లో ఎంతమందికి ఆ నమ్మకం కలిగించారు? ఎంతమందికి ఆ భరోసా ఇచ్చారు? అర్జీదారులకు అగచాట్లే మిగిలాయి.. అనడానికి ఈవారం పీజీఆర్ఎస్‌కు వచ్చిన బాధితుల మాటలే చక్కని ఉదాహరణ.

ఊతకర్ర విరిచేశారు..

దివ్యాంగుల పింఛన్లు తగ్గించి, తొలగించడంపై తీవ్రమైన ఆవేదన

తుమ్మపాల:

అర్హులైన దివ్యాంగుల పింఛన్లు కొనసాగించడంతో పాటు పాత స్లాబులోనే పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద దివ్యాంగులు ధర్నా చేశారు. పింఛన్లు రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం నోటీసులు అందజేయడం దారుణమని, అలా నోటీసులు అందుకున్న వారిలో అర్హులైన వికలాంగులు అనేకమంది ఉన్నారని వక్తలు పేర్కొన్నారు. 85 శాతం కన్నా ఎక్కువ వైకల్యం ఉన్న వారికి గతంలో ఇచ్చిన రూ.15 వల పింఛన్ రూ.6 వేలకు తగ్గించడం అన్యాయమన్నారు.



దివ్యాంగుల ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

60 ఏళ్ల వయస్సు పైబడ్డ వికలాంగుల పింఛన్లను రూ.15 వేలు, రూ.6 వేల కేటగిరీ నుంచి మార్చి వృద్ధాప్య పింఛను కేటగిరీ రూ.4 వేలకు కుదిస్తున్నారని చెప్పారు. అపీల్ చేసేందుకు వికలాంగులను కార్యాలయాల చుట్టూ తిరగాలని చెప్పడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. బోగస్ పింఛన్లు ఉంటే తొలగించవచ్చు కానీ ఆ పేరిట అర్హుల పింఛన్లను తొలగించడం మంచి పద్ధతి కాదన్నారు. వైకల్యంతో బాధపడుతూ, పింఛన్ డబ్బులే ఆసరాగా బతుకుతున్న కుటుంబాలు అనేకం ఉన్నాయని, వారి నోటికాడ కూడును లాక్కోవడం తగదన్నారు. దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తదితరులు సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

పక్షవాతంతో 88 శాతం వైకల్యం ఉన్నా..



పోస్టు పోలియో రెసిడ్యూయల్ పెరాలసిస్ కలిగి 88 శాతం అంగవైకల్యంతో పాకుతూ నడుస్తుంటాను. నాకు కూడా అన్యాయం జరిగింది. నెలకు రూ.15 వేల పింఛన్ వచ్చేది.ఇప్పుడు రూ.6 వేలకు పరిమితం చేస్తూ నోటీసు ఇచ్చారు. భవిష్యత్తును తలచుకుంటే తీవ్ర ఆందోళనగా ఉంది. అధికారులు నా భౌతిక రూపాన్ని చూసైనా పింఛన్ యథావిధిగా కొనసాగించాలని కోరుతున్నాను.

–సరసా నాగరాజు, పెదగుమ్మలూరు గ్రామం, ఎస్.రాయవరం మండలం

ఇది అమానవీయం



తాత్కాలిక సదరం పత్రాలు రద్దు చేసి శాశ్వత సదరం పత్రాలు మంజూరు చేయడం ద్వారా దివ్యాంగుల పింఛన్‌కు భరోసా ఉంటుంది. దివ్యాంగులు ఆందోళన బాట పట్టకుండా ప్రభుత్వం నోటీసులు పున:పరిశీలించాలి. అపీల్ పేరిట దివ్యాంగులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం అమానవీయం. దీనిని తీవ్రమైన చర్యగా పరిగణించాలి. దివ్యాంగుల పొట్టగొట్టే ఆలోచన మానుకోవాలి.

– బుగిడ నూకఅప్పారావు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి

కొత్తవి లేవు.. ఉన్నవి తొలగిస్తున్నారు



వెరిఫికేషన్ పేరిట దివ్యాంగులను చిత్రహింసలు పెట్టడం తగదు. ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దనే ఫిర్యాదులు స్వీకరించాలి. ఆర్థిక భారం తగ్గించుకునేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు దారుణమైనవి. ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయకుండా ఉన్నవి తొలగించడం చాలా అన్యాయం.

–ఆర్.భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు

రెవెన్యూ కష్టాలు ఇన్నన్ని కావయా..

తుమ్మపాల: ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)తో తమ సమస్యలు తీరడం లేదని, తమ గోడు పట్టించుకోవడం లేదని అర్జీదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ సమస్యలపై వినతులు ఇచ్చినా పరిష్కారం లభించకపోవడంతో పదేపదే కలెక్టరేట్‌కు రావాల్సి వస్తోందన్నారు. తమను పలువురు సిబ్బంది చులకనగా చూస్తున్నారని, తమ బాధ చెప్పుకున్నందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో దాదాపు 80 శాతం అర్జీలు రెవెన్యూ భూ సంబంధితమైనవే అయినప్పటికీ జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు. విచారణ నిమిత్తం వచ్చే అధికారులు అర్జీదారులతో మాట్లాడుతూ తీసుకున్న ఫొటోలను అప్‌లోడ్ చేసి సమస్య పరిష్కరించినట్టు జవాబు ఇవ్వడంతో అవాక్కవుతున్నామని చెప్పారు. కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఈవారం మొత్తం 344 అర్జీలు నమోదు కాగా వాటిలో 188 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉన్నాయి.



కుమార్తె సహాయంతో వచ్చి కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న నారాయణమ్మ

నా భూమిని కొడుకులు లాగేసుకున్నారు..

భూ పంపకాల్లో తనకు కేటాయించిన రెండెకరాల భూమిని ఆన్‌లైన్‌లో తొలగించి తప్పుడు సంతకాలతో కొడుకులు వారి పేరున ఆన్‌లైన్ చేసుకుని వృద్ధాప్యంలో ఉన్న తనను ఒంటరిగా వదిలేశారని నాతవరం మండలం పి.కె.గూడెం గ్రామానికి చెందిన లోగుడు నారాయణమ్మ ఫిర్యాదు చేశారు. తన భర్త ద్వారా వచ్చిన భూమిని ఇద్దరు కుమారులకు 6 ఎకరాల చొప్పున పంపకాలు చేసి మిగిలిన రెండెకరాలు తన వద్ద ఉంచుకున్నానని, తన తదనంతరం కుమార్తెలకు చెందాలని రాశానన్నారు. ఇది ఇష్టం లేని కుమారులు తాను బతికుండగానే తమ పేరిట మార్చేసుకున్నారని చెప్పారు. భూమిని తన పేరున ఆన్‌లైన్ చేసి న్యాయం చేయాలని కోరారు. రెండు నెలల క్రితం అర్జీ చేసినప్పటికీ స్పందన లేదన్నారు.

కూలీ స్థలం కబ్జా చేశారు



నగిరెడ్డి సన్యాసిరావు, కొండకర్ల గ్రామం, అచ్యుతాపురం మండలం

తన ఇంటి స్థలం కబ్జా అయిందని పదే పదే ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించలేదంటూ అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామానికి చెందిన నగిరెడ్డి సన్యాసిరావు అర్జీ సమర్పించారు. గ్రామంలో సర్వే నెం.50లో తన పేరున గల (అసెస్‌మెంట్ నెం.31) ఇంటిస్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేస్తున్నారని ఆయన చెప్పారు. తాను కూలి పనుల నిమిత్తం కుటుంబంతో గాజువాక మండలం దువ్వాడలో ఉంటున్నానని, దీనిని ఆసరాగా చేసుకుని ఆక్రమణదారులు తన ఇంటి స్థలంలో నిర్మాణం చేస్తున్నారని, దీనిపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, కలెక్టరేట్‌లో మూడుసార్లు వినతులు ఇచ్చినా పరిష్కారం లభించలేదని ఆయన వాపోయారు.

కాలువ గట్టుపై అక్రమ నిర్మాణం

ఏలేరు కాలువ గట్టుపై అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, సామాజిక భవనం మెట్లు ధ్వంసం చేసిన కూటమి నాయకులపై కేసు నమోదు చేయాలని అనకాపల్లి మండలం బట్లపూడి గ్రామం రాయుడుపేటకు చెందిన దొడ్డి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. గ్రామాన్ని ఆనుకుని ఏలేరు కాలువ గట్టుపై అడ్డంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలంటూ ఫిర్యాదులు చేస్తున్నా ఏలేరు కాలువ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన సామాజిక భవనం మెట్లు తొలగించడంపై కూడా కలెక్టరేట్‌లో రెవెన్యూ, పంచాయతీ అధికారులపై ఫిర్యాదులు చేశామని, ఎటువంటి చర్యలు లేవన్నారు. అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

అన్నదాతలకు ఎరువు కష్టాలు!

అరకొరగా యూరియా పంపిణీ

పీఏసీఎస్‌ల వద్ద గంటల తరబడి పడిగాపులు

రైతులకు ఖరీఫ్ కష్టాలు కొనసాగుతున్నాయి. ఒకవైపు వాతావరణ పరిస్థితులు అనుకూలించక, మరోవైపు కూటమి ప్రభుత్వం నుంచి సరైన తోడ్పాటు లేక అప్పులతో పెట్టుబడులు, విత్తనాలు, ఎరువుల కొరత రైతులను అవస్థల పాలు చేస్తున్నాయి.

గత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియాను అందించేవారు. ఈ ప్రక్రియతో రైతులకు ఇబ్బందులు తప్పేవి. సకాలంలో ఎరువులు అందించడంతో పంటల సాగుపై ఆసక్తి చూపేవారు. కూటమి ప్రభుత్వ వచ్చాక రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేయడంతో పాటు పెట్టుబడి సాయం, ఎరువులు, విత్తనాలు సైతం రైతులకు సకాలంలో అందించడంలో విఫలం కావడంతో రైతులు సాగుకు అష్ట కష్టాలు పడుతున్నారు.



మునగపాక పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు




కె.కోటపాడు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు

మునగపాక/కె.కోటపాడు :

వివిధ రకాల పంటల సాగుకు అనువుగా ఎరువులను రప్పించాల్సి ఉన్నా పాలకులు గాని,అధికారులు గాని పట్టించుకోలేదంటూ రైతులు వాపోతున్నారు. ప్రధానంగా యూరియా కోసం రైతులు నానా హైరానా పడుతున్నారు. సోమవారం మునగపాక పీఏసీఎస్ కార్యాలయం వద్ద అరకొరగా యూరియా అందించడంతో రైతులు క్యూ కట్టారు. ఎండలో గంటల తరబడి నిలబడి యూరియాను తీసుకువెళ్లారు. ఇలాంటి పరిస్థితులు మునుపెన్నడూ లేవని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూరియా కోసం అవస్థలు పడుతున్నామంటూ రైతులు వాపోయారు. రెండు రోజుల క్రితం 12 టన్నుల మాత్రం యూరియా రప్పించడంతో వాటి కోసం రైతులు పీఏసీఎస్ కార్యాలయానికి పరుగులు తీయాల్సి వచ్చింది.

కె.కోటపాడు మండలం చౌడువాడ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు ఉదయం ఆరు గంటల నుంచే పడిగాపులు కాశారు. పీఏసీఎస్‌కు యూరియా వచ్చిందన్న సమాచారంతో ఆ పరిధిలో గల గ్రామాలైన చౌడువాడ, గుల్లేపల్లి, రొంగలినాయుడుపాలెం, పైడంపేట, పాచిలవానిపాలెం నుంచి వందలాదిగా రైతులు పీఏసీఎస్ వద్దకు చేరుకున్నారు. వరి సాగుకు అనువైన కాలంలో యూరియాను వేయడం మంచిదన్న కారణంగా ఉదయం ఆరు గంటలకే పీఏసీఎస్ వద్దకు చేరుకున్నారు. పాస్ పుస్తకాలతో పాటు జెరాక్స్ పత్రాలను క్యూలైన్‌లో ఉంచారు. పీఏసీఎస్‌కు ప్రస్తుతం 12 టన్నుల యూరియా మాత్రమే రావడంతో పెద్ద సంఖ్యలో వచ్చిన రైతులకు ఎలా పంపిణీ చేయాలో అని సిబ్బంది తలలు పట్టుకున్నారు. యూరియా ఎప్పుడు ఇస్తారో అని ఎదురు చూసిన రైతులకు రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసి మధ్యాహ్నం 2 గంటల తరువాత పంపిణీ చేపట్టారు. ఒక్క బస్తా యూరియా అయినా దక్కుతుందని ఎదురు చూసినా పలువురు రైతులకు ఎరువులు అందక నిరాశతో వెనుదిరిగారు. ఇప్పటి వరకూ వచ్చిన 36 టన్నుల యూరియాను పీఏసీఎస్ ద్వారా పంపిణీ చేశామని, సీఈవో బత్తిన సత్యనారాయణమూర్తి తెలిపారు.

గతంలో ఈ పరిస్థితి లేదు..



గత ఐదేళ్లలో అప్పటి సీఎం జగన్ పాలనలో యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి రాలేదు. అప్పట్లో పీఏసీఎస్‌కు సరిపడా యూరియా వచ్చేది. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా కూడా యూరియాను ఇచ్చేవారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సరిపడా యూరియాను ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం, అధికారులు లేనట్టుగా ఉంది. ఒక్క యూరియా బస్తా కోసం గంటల కొద్ది వేచి ఉన్నా దక్కని పరిస్థితి నెలకొంది. రైతులకు అవసరమయిన యూరియాను వెంటనే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–త్రిశూలం ఈశ్వరరావు, రైతు, చౌడువాడ

క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీలు పరిష్కరించాలి


పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- కలెక్టర్ విజయ్ కృష్ణన్
- పీజీఆర్ఎస్‌కు 344 అర్జీలు

తుమ్మపాల: కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఆయా శాఖల అధికారులు వ్యక్తిగతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలన్నారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని రోజూ పర్యవేక్షణ చేసి నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలన్నారు. సమర్పించిన అర్జీల సమాచారం కోసం అర్జీదారులు టోల్ ఫ్రీ నంబరు 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చని అర్జీదారులకు సూచించారు. ఈ వారం మొత్తం 344 అర్జీలు నమోదు కాగా, వాటిలో 188 అర్జీలు రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పరిష్కారం కానివే ఉండటం గమనార్హం.

ఆర్.కొత్తూరు గ్రామాన్ని నాతవరంలో విలీనం చేయాలని ధర్నా

అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొయ్యూరు మండలం ఆర్.కొత్తూరు గ్రామాన్ని అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద గ్రామస్తులు నిరసన చేశారు. కొయ్యూరు గిరిజన మండలంలో గిరిజనేతరులు ఉన్న ఆర్.కొత్తూరు గ్రామాన్ని చేర్చడంతో తమ భూములకు ప్రభుత్వం ఎటువంటి పథకాలు అమలు చేయడం లేదని వాపోయారు. దాంతోపాటు సమీపంలో నాతవరం మండల కేంద్రాన్ని దాటుకుని అత్యధిక దూరంలో కొయ్యూరుకు చేరుకోవాల్సి వస్తుందని, తమ ఆవేదనను అధికారులు అర్థం చేసుకుని ప్రభుత్వానికి నివేదించి న్యాయం చేయాలని కోరారు.



శ్మశాన వాటిక ఆక్రమణపై గవరవరం గ్రామస్తుల నిరసన

శ్మశాన వాటికను ఆక్రమిస్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చోడవరం మండలం గవరవరం గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. గ్రామంలో ఎనిమిది కులాల వారికి సర్వే నంబరు 111-8లో 1.23 ఎకరాల శ్మశాన వాటిక ఉందన్నారు. గతంలో కొంత స్థలం ఆక్రమణకు గురి కాగా, కోర్టు ఆదేశాలతో 80 సెంట్ల భూమి ప్రస్తుతం శ్మశానవాటికగా ఉందని, దాన్ని కూడా మాజీ సర్పంచ్ వెంకటస్వామినాయుడు ఆక్రమిస్తున్నారని, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పరిష్కారం లేకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని గ్రామస్తులు తెలిపారు.



ఎస్పీ కార్యాలయానికి 46 అర్జీలు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్‌కు 46 అర్జీలు వచ్చాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి పలువురు అర్జీదారులు తమ సమస్యలపై ఎస్పీ తుహిన్‌సిన్హాకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భూ తగాదాలు -20, కుటుంబ కలహాలు -3, మోసపూరిత హామీలపై ఫిర్యాదులు- 4, ఇతర విభాగాలకు చెందినవి -19 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. చట్టపరిధిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కిందస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

విఘ్నాలు తొలగించే ఒడ్డిమెట్ట లక్ష్మీ గణపతి


భక్తుల పూజలందుకుంటున్న లక్ష్మీగణపతి

- రేపటి నుంచి నవరాత్రులు ప్రారంభం
- దేవదాయ శాఖ ఏర్పాట్లు
- జాతరకు తరలిరానున్న వేలాది మంది భక్తులు


కైలాసగిరిపై లక్ష్మీగణపతి ఆలయం

నక్కపల్లి: హిందువుల మొదటి పూజ వినాయకుడికే.. విఘ్నాలు తొలగించాలని వేడుకుంటారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న వినాయక నవరాత్రి మహోత్సవాలకు ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయం సిద్ధమవుతోంది. గ్రామీణ జిల్లా భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న స్వామివారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ ఏర్పాట్లు చేసింది. చవితినాడు అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం, తుని, అన్నవరం, పాయకరావుపేట, నక్కపల్లి, తదితర పట్టణాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.

ఆలయ చరిత్ర..

ఒడ్డిమెట్ట కైలాసగిరిపై దాదాపు నూరేళ్ల క్రితం తాటిచెట్టు మొదలులో లక్ష్మీగణపతి వెలిశాడని పూర్వీకుల కథనం. నామవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి స్వామివారు కలలో కనిపించి కైలాసగిరిపై ఫలానా చోట తాను వెలిసినట్లు చెప్పడంతో అక్కడ తవ్వకాలు జరుపగా విగ్రహం బయటపడింది. ఐదో నంబరు జాతీయ రహదారికి ఆనుకుని పందిరి వేసి విగ్రహం పెట్టి పూజలు చేయడం ప్రారంభించారు. రహదారిపై ప్రయాణించే వారు కానుకల రూపంలో వేసిన ఆదాయంతోపాటు విరాళాలు సేకరించి కొండపై ఆలయాన్ని నిర్మించారు. తర్వాత ఈ ఆలయం దేవదాయ శాఖ ఆధీనంలోకి వెళ్లింది. చవితినాడు ఇక్కడ పెద్ద తిరునాళ్లు జరుగుతుంది. కొత్తగా వ్యాపారం ప్రారంభించేవారు, కొత్త వాహనాలు కొన్నవారు తొలుత ఇక్కడ విఘ్నేశ్వరుడికి పూజలు చేసిన తర్వాత తమ పనులు ప్రారంభిస్తారు. ఈ ఆలయంలో గణపతిని దర్శించుకుని చేపట్టిన ప్రతి అభివృద్ధి పని నిర్విఘ్నంగా పూర్తవుతుందనేది భక్తుల నమ్మకం. ఇలా తమ కోర్కెలు నెరవేరిన భక్తులు ఇచ్చిన విరాళాలతోనే పలు అభివృద్ధి పనులు చేపట్టడం గమనార్హం. ఇక్కడ గణపతి, కాశీవిశ్వేశ్వర, కనకదుర్గ, నవగ్రహ, లక్ష్మీ నారాయణ ఆలయాలు ఉన్నాయి.

ఇలవేల్పుగా వినాయకుడికి పూజలు..

ఒడ్డిమెట్ట గ్రామస్తులు లక్ష్మీగణపతిని తమ ఇలవేల్పుగా కొలుస్తారు. సంక్రాంతి, ఉగాది తర్వాత అంత ప్రాధాన్యతగా వినాయక చవితిని అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. చవితినాడు బంధువుల రాకతో ఇళ్లన్నీ సందడిగా ఉంటాయి. ఈ గ్రామంలో ప్రతి ఇంట్లో ఒక్కరికైనా గణపతి పేరు ఉండటం గమనార్హం.

నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి...

నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థాన పాలక మండలి చైర్మన్ పైలా నూకన్ననాయుడు, అర్చకుడు జయంతి గోపాలకృష్ణ తెలిపారు. ఉదయం 5 గంటల నుంచే స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. 27వ తేదీ రాత్రి సాయంత్రం స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం బారికేడ్లు, క్యూ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నారు. రూ. 20 ప్రత్యేక దర్శనం కోసం టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. సాధారణ దర్శనం కల్పిస్తున్నారు..

పోలీసు బందోబస్తు...

వేలాది మంది భక్తులు తరలి రానుండటంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నక్కపల్లి సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబుల పర్యవేక్షణలో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మెట్ల మార్గం వరకు వాహనాలను అనుమతించకుండా రోడ్డుపైనే పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నక్కపల్లి, పాయకరావుపేటల నుంచి పోలీస్ సిబ్బందిని రప్పించి బందోబస్తు నిర్వహిస్తామన్నారు. గతేడాది ప్రభుత్వ నిధులు, దాతల విరాళాలు సేకరించి రూ.20 లక్షలతో కొండపైకి సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో పాత రోడ్డును ఆనుకుని నిర్మించిన రోడ్డులో భక్తులు కొండపైకి చేరుకోవచ్చు.

యువత క్రీడలపై మొగ్గు చూపేలా ప్రోత్సాహం

- కలెక్టర్ విజయ కృష్ణన్


జిల్లా స్థాయి జిల్లా క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: క్రీడలను ప్రోత్సహించి, చురుకైన క్రీడాకారులను తయారు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి జిల్లా క్రీడా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, యువత వ్యసనాలకు బానిసకాకుండా క్రీడల వైపు మొగ్గు చూపే విధంగా క్రీడా మైదానాలు సిద్ధం చెయ్యాలని కమిటీ సభ్యులకు సూచించారు. నర్సీపట్నం, అనకాపల్లి మున్సిపాలిటీ పరిధిలో భూమిని సేకరించి ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో స్విమ్మింగ్ పూల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని ఆయా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలోని గుర్తించిన 15 మండల కేంద్రాల్లో 20 సెంట్లు చొప్పున భూమిని సేకరించడం జరిగిందన్నారు. వీటిని సమగ్రంగా పరిశీలించి వాలీబాల్ కోర్టులు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని జెడ్పీ సీఈవో నారాయణమూర్తిని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాటాడుతూ పికెల్ బాల్ కోర్టు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేయడానికి స్థలాన్ని పరిశీలించి నివేదిక సమర్పించామని ఏపి విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రసాద్‌కు ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, జిల్లా క్రీడాలు అభివృద్ధి అధికారి ఎల్.వెంకట రమణ, జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజకుమార్, డీపీవో సందీప్, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి మంజుల వాణి, డ్వామా పీడీ పూర్ణిమా దేవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి పార్టీల్లో ఫ్లెక్సీల లొల్లి

- జనసేన వర్సెస్ టీడీపీ సోషల్ మీడియాలో వార్
- హోంమంత్రి అనితను ట్యాగ్ చేస్తూ విమర్శలు

నక్కపల్లి : కూటమి పార్టీల్లో ఫ్లెక్సీల లొల్లి రాజుకుంది. హోంమంత్రి పాల్గొన్న కార్యక్రమంలో అందరి ఫొటోలు వేసి తమ పార్టీ నాయకుడు గెద్దం బుజ్జి ఫొటో వేయకపోవడం పట్ల జనసేన కార్యకర్తలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. సోషల్‌మీడియా వేదికగా టీడీపీ వైఖరిపై తీవ్రమైన విమర్శలు గుప్పిస్తున్నారు. ముందుంది ముసళ్ల పండగ రాబోయే ఎన్నికల్లో జనసైనికుల సత్తా ఏంటో చూపిస్తామంటూ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశమయింది. వివరాల్లోకి వెళ్తే ఆదివారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట మండలం పెంటకోటలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు రుణాలు పంపిణీ చేసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వెనుక టీడీపీ నాయకులు పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలో జిల్లా, నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులందరి ఫొటోలు వేశారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి గెద్దం బుజ్జి ఫొటో వేయలేదు. మిగిలిన చోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కూడా బుజ్జి ఫొటో వేయకపోవడాన్ని జనసేన కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. కొంతమంది జనసేన కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించినట్లు తెలిసింది. అంతటితో ఆగకుండా ఫేస్‌బుక్, వాట్సాప్‌గ్రూపులు, ఇన్‌స్టాల్లో టీడీపీ నాయకుల వైఖరిని ఎండ గడుతున్నారు. మంత్రి అనితతో పాటు పలువురు టీడీపీ నాయకుల పేజీలను ట్యాగ్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. నియోజకవర్గంలో జనసేన, బీజేపీలకు టీడీపీ వాళ్లు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నది ఆ రెండు పార్టీల కార్యకర్తల్లో ఆవేదన నెలకొంది.



ఫేస్‌బుక్‌లో అనితను ట్యాగ్ చేస్తూ జనసేన కార్యకర్తలు పెట్టిన ఫోటో, పోస్ట్

కొద్దిరోజుల క్రితం ఎస్.రాయవరం మండలంలో జనసేన పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడి ఇంటికి కుళాయి ఇవ్వకుండా అక్కడ టీడీపీ సర్పంచ్ అడ్డుకున్నాడు. నిలదీసిన జనసేన నాయకుడిపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జనసేన నాయకులు బాధితుడికి అండగా నిలిచారు. పట్టుబట్టి కుళాయి వేయించారు. తాజాగా నియోజకవర్గ సీనియర్ నాయకుడి ఫొటో వేయకుండా కావాలనే అవమానించారంటూ రగిలిపోతున్నారు.

ఆటో బైక్ ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

నాతవరం: మండలంలో నర్సీపట్నం - తుని మధ్య మన్యపురట్ల జంక్షన్‌లో ఆదివారం రాత్రి ఆటో బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నాతవరం ఎస్ఐ సిహెచ్. భీమరాజు వివరాలు మేరకు... ఎం.బి.పట్నం గ్రామానికి చెందిన సీమంతులు దుర్గాప్రసాద్, అనపర్తి సాయి తమ బైక్‌పై గన్నవరం మెట్టకు ఆదివారం సాయంత్రం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరారు. అదే సమయంలో నర్సీపట్నం నుంచి తుని వైపు ఆటో వెళ్తోంది. ఇవి మన్యపురట్ల జంక్షన్‌లో ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్, సాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణించేవారికి ఎలాంటి గాయాలు కాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ : క్లీనర్ మృతి


నుజ్జయిన లారీ ముందుభాగం

నక్కపల్లి: జాతీయ రహదారిపై గొడిచర్ల కొత్తూరు సమీపంలో ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టింది. సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో క్లీనర్ మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రాజమహేంద్రవరం నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ టైరు పంక్చర్ అయింది. దాంతో రోడ్డు పక్కన నిలిపి టైరు మారుస్తుండగా, వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వెనుక లారీలో ఉన్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన క్లీనర్ ప్రదీప్ రామ్‌నాయక్(55) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వెనుక నుంచి ఢీకొట్టిన లారీ ముందుభాగం నుజ్జయింది.

ప్రాథమిక దశలో క్యాన్సర్ గుర్తించాలి

- డీఎంహెచ్‌వో హైమావతి



వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో హైమావతి

అనకాపల్లి: క్యాన్సర్‌పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి సకాలంలో వైద్యం అందించినట్లయితే ఆరోగ్యంగా జీవిస్తారని డీఎంహెచ్‌వో ఎం.హైమావతి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలో పీహెచ్‌సీ వైద్యులతో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా ప్రజలకు క్యాన్సర్ లక్షణాలు కనిపించినట్లయితే మొదటి దశలో స్క్రీనింగ్ టెస్ట్, రక్తపరీక్షలు చేయించాలన్నారు. కొంతమంది వ్యక్తులకు క్యాన్సర్ 3, 4 దశల్లో ఉన్నప్పుడు తెలుసుకుంటారని, అటువంటి వారికి సకాలంలో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ పీవో డాక్టర్ ఎస్తేర్‌రాణి, వైద్యులు పాల్గొన్నారు.

జీడి పిక్కల అక్రమ నిల్వలపై కొరడా

- నాతవరంలో రెండు చోట్ల ఆకస్మిక దాడులు
- లైసెన్స్‌తో పాటు మార్కెట్ పన్నులు చెల్లించాలి
- వ్యవసాయ మార్కెట్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్

నాతవరం:

జీడి పిక్కల అక్రమ నిల్వలపై వ్యవసాయ మార్కెట్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ కొరడా ఝుళిపించారు. ఆయన సోమవారం నాతవరం గ్రామంలోని జీడి పిక్కల గొడౌన్లపై సోమవారం ఆకస్మికంగా దాడులు చేశారు. నిబంధనలు ఉల్లంఘించి మార్కెట్ సెస్ చెల్లించకుండా వ్యాపారులు రెండు చోట్ల నిల్వ చేసిన జీడి పిక్కల బస్తాలను గుర్తించారు. ఒక చోట 140 క్వింటాళ్లు, మరో చోట 90 క్వింటాళ్ల జీడిపిక్కల బస్తాలు మార్కెట్ పన్నులు చెల్లించకుండా అక్రమంగా నిల్వ చేసినట్టు నిర్ధారించారు. అలాగే జీడి పిక్కలు వ్యాపారం చేసే వారికి లైసెన్స్ సైతం లేదని తెలుసుకున్నారు. 140 క్వింటాళ్లకు రూ.19,500 మార్కెట్ పన్ను విధించగా.. వ్యాపారికి లైసెన్సు లేకపోవడంతో లైసెన్సు ఫీజు కింద మరో రూ.5,100 జరిమానా విధించామని సుధాకర్ తెలిపారు. 90 క్వింటాళ్ల జీడి పిక్కలకు మార్కెట్ పన్ను రూ.9వేలు, వ్యాపారికి లైసెన్స్ ఫీజు కోసం రూ.5100 జరిమానా విధించామన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యాపారం చేసే ప్రతి వ్యక్తి లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. జీడి పిక్కల అక్రమ నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టాలని నర్సీపట్నం మార్కెట్ కమిటీ సెక్రటరీ భువనేశ్వరికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి, పాయకరావుపేట, మాడుగులు, చోడవరం మార్కెట్ కమిటీల సెక్రటరీలతో పాటు నర్సీపట్నం మార్కెట్ కమిటీ సిబ్బంది, స్థానిక ఆర్ఐ నాగరాజు వీఆర్వో బాబు, పోలీసులు పాల్గొన్నారు.


అక్రమంగా నిల్వ చేసిన జీడి పిక్కల బస్తాలను లెక్కిస్తున్న మార్కెట్ కమిటీ సిబ్బంది

రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని వినతి

నక్కపల్లి:

మండలంలో బల్క్‌డ్రగ్ పార్క్, స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం నివాస ప్రాంతాలను త్యాగం చేసిన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు చెల్లించాలని డీఎల్‌పురం సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం అప్పలరాజు కోరారు. ఈ మేరకు సోమవారం నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణకు వినతి పత్రం ఇచ్చారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం నిర్వాసితులు ఏడాది నుంచి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేవలం రూ.8.90 లక్షలు ఇవ్వడానికి సిద్ధపడుతున్నారని, ఇది ఏ మాత్రం చాలదన్నారు. నిర్వాసితులకు పెద బోదిగల్లం వద్ద పునరావాస కాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలు కేటాయించారని, అక్కడ ఇల్లు నిర్మాణానికి ప్యాకేజీ ఏమాత్రం సరిపోదన్నారు. నిర్వాసిత కుటుంబాల్లో యజమానితోపాటు 18 ఏళ్ల వయసు నిండిన వారికి వివాహమైన ఆడపిల్లలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. నిర్వాసితులకు ఆర్ కార్డులు ఇవ్వాలని, స్థానికంగా ఏర్పాటు చేసే కంపెనీల్లో పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. చందనాడ, తమ్మలపేట అమలాపురం మూపర గ్రామాల్లో కొంతమంది ఇళ్లు కోల్పోయిన వారికి ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని, ఈ సమస్యా పరిష్కరించాలని కోరారు. సీపీఎం మండల కన్వీనర్ ఎం రాజేష్ పాల్గొన్నారు.


ఆర్డీవో రమణకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు రామకృష్ణ, అప్పలరాజు తదితరులు

వీవోఏ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా రూపాదేవి

అనకాపల్లి:

ఏపీ వీవోఏ(వెలుగు యానిమేటర్లు) సంఘం జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్.రూపాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంకటలక్ష్మి, జిల్లా గౌరవాధ్యక్షుడిగా వి.వి.శ్రీనివాసరావు, కోశాధికారిగా సిహెచ్.ఎల్.ఎస్. రాజేష్, జిల్లా కార్యదర్శులుగా కె. కనకలక్ష్మి (కోటవురట్ల), ఎం రాజ్యలక్ష్మి(నర్సీపట్నం), జి. సత్యవతి (రావికమతం), అప్పలనాయుడు(చీడికాడ), భవాని (కశింకోట), ఉష (మునగపాక), కె.సూరిబాబు (దేవరాపల్లి), లావణ్య (అచ్యుతాపురం), క్రాంతి (నాతవరం), రాము (అనకాపల్లి), మరో 25 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు రూపాదేవి మాట్లాడుతూ పై కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. వీవోఏలకు గుదిబండగా ఉన్న మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దుతోపాటు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, కనీస వేతనాలు, గ్రూపు ఇన్సూరెన్స్, యూనిఫాం, ఐడీ కార్డులు తదితర సమస్యలపై భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.


వీవోఏ నూతన కార్యవర్గ సభ్యులు

క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు, డాక్టర్ సిద్ధార్థ ఆధ్వర్యంలో మండలంలో గొలగాం గ్రామంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో ప్రజలు ఉచిత వైద్య సేవలు పొందాలని కోరారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేస్తున్న పరిశ్రమ యాజమాన్యం

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలుకు రూ.60 వేలు విలువైన కంప్యూటర్, ఆల్ ఇన్ వన్ ప్రింటర్‌ను బయ్యవరంలోని సాగర్ సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు సోమవారం బహూకరించారు. హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి అభ్యర్థన మేరకు దీన్ని అందించామని పరిశ్రమ జీఎం ఎన్వీ ప్రసాదరావు తెలిపారు. పరిశ్రమ సీనియర్ మేనేజర్ పీవి పాండురంగారావు, సిబ్బంది. ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమావేశంలో నాయకులు

కశింకోట: పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు అందించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. స్థానిక పంచాయతీ వద్ద ఏపీ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) కార్మికుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల వరకు వేతన బకాయిలు ఉన్నాయన్నారు. దీనివల్ల వడ్డీలకు అప్పులు తేవడం వల్ల వాటిని చెల్లించలేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, బీమా, పదవీ విరమణ సదుపాయాలు, వేతనంతో కూడిన ఇతర సెలవులు ఇవ్వాలని, అర్హులకు అటెండర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు జి. కొండబాబు, ప్రతినిధులు సత్తిబాబు, అబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులతో వైఎస్సార్ సీపీ నేతలు

కశింకోట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదినం పురస్కరించుకొని సోమవారం కొక్కిరాపల్లి ప్రేమ సమాజానికి నెలకు సరిపడిన బియ్యం, నిత్యావసర సరకులను వితరణ చేశారు. పార్టీ నాయకులు గొంతిన శివ, వజ్రం నాగశ్రీనుల ఆధ్వర్యంలో ప్రేమ సమాజంలో ముందుగా కేకును పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిశోర్ కట్ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, నమ్మి గణేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా :సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1: పరద
సత్యనారాయణ స్క్రీన్-2: మేఘాలు చెప్పిన ప్రేమకథ
పర్తిసాయి : మహావతార్ నరసింహం
షిర్డీసాయి : కూలీ
వెంకటేశ్వర : బన్ బట్టర్ జామ్
శ్రీ సత్య : సోమేశ్వర సులోచన
రామచంద్ర : వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9, బీ పాజిటివ్-27, ఓ పాజిటివ్-40, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 372 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

యూరియా.. ఏదయా?

● సరిపడా నిల్వలు లేక ఇబ్బందులు ● సొసైటీల చుట్టూ ప్రదక్షిణలు



తుమ్మపాల రైతు సేవా కేంద్రం వద్ద క్యూలైన్లలో బారులు తీరిన రైతులు

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో యూరియా కోసం ఏనాడూ ఇబ్బంది పడని రైతులు కూటమి పాలనలో అగచాట్లు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు, పీఏసీఎస్‌లకు వెళ్తే స్టాక్ లేదని వారిని తిప్పు పంపుతున్నారు. దాంతో ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. అయినప్పటికీ ఒక బస్తానే ఇవ్వడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం దండగ అని ఏనాడో చెప్పిన సీఎం చంద్రబాబు మరోమారు తమ పట్ల వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



యూరియా టోకెన్ల కోసం మహిళల అగచాట్లు

అనకాపల్లి టౌన్: ఆరంభంలోనే అన్నదాతకు ఖరీఫ్ కష్టాలు మొదలయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో పంటలు వేసి ఎరువుల కోసం రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒక రోజు వచ్చి పేర్లు నమోదు చేసుకొని మరలా రావల్సి వస్తుందని వాపోతున్నారు. ముఖ్యంగా యూరియా తీసుకోవాలంటే నానా అగచాట్లు పడాల్సి వస్తుంది. అధికారులు మాత్రం దీనికి భిన్నంగా ఎవరికీ ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ఎరువులు సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. మండలంలోని ఇప్పటికే దుక్కు దున్నుకుని నాట్లు వేసుకున్నారు. మండల వ్యాప్తంగా పంటలకు సరిపడా యూరియా నిల్వలు ఉంచడంలో అధికారులు పెద్దగా పట్టించుకోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యూరియా కోసం అగచాట్లు

మండలంలోని 7,776 ఎకరాల్లో పంటలను సాగు చేస్తుండగా 6,500 ఎకరాలు వరి, 200 ఎకరాలు చెరకు, మిగిలిన ఎకరాల్లో మొక్కజొన్న తదితర పంటలు పండిస్తున్నారు. 1,436 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. వీరందరికి 937 టన్నుల యూరియా అవసరం అని అధికారులు లెక్కలు వేశారు. ఇప్పటి వరకు 596 టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. ఈ యూరియా మొత్తం రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్నారు. సకాలంలో యూరియా అందక రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద ఎప్పుడు చూసినా బారులు తీరి కనిపిస్తున్నారు. మండలంలో కొన్ని రైతు సేవా కేంద్రాల వద్ద స్టాక్ లేదు, మరలా రండి అని పంపి చేస్తున్నారు. దీంతో పలువురు రైతులు ప్రైవేట్ షాపులను ఆశ్రయించి రూ.350 నుంచి రూ.400 వెచ్చించి కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణమే రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



నాట్లు వేసిన వరి పంట

అధిక ధరకు యూరియా



బయట అధిక ధరకు యూరియాను కొనాల్సి వస్తుంది. సీజన్ ప్రారంభంలోనే స్టాక్ లేదంటున్నారు. అధికారులేమో ఎక్కడా కొరత లేదంటున్నారు. గాంధీనగరం అన్నపూర్ణ బ్యాంక్‌లో రైతు సేవా కేంద్రం వద్దకు రోజూ తిరుగుతునే ఉన్నాను.
– పలకా నాగేశ్వరావు, రైతు వేట జంగాల పాలెం

కాళ్లరిగేలా తిరుగుతున్నాం



నాట్లు వేసి యూరియా కోసం తిరగాల్సి వస్తుంది. మాకు ఎంత అవసరమో అంత సరఫరా చేయడం లేదు. మొక్క ఎదుగుదలకు యూరియా చాలా అవసరం. తక్షణమే రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలి.
–వి. అప్పల స్వామి, రైతు, తుమ్మపాల

బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలి

యూరియా బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్న వ్యాపారులపై దాడులు చేసి పీడీ యాక్ట్‌లు పెట్టాలి. అక్రమంగా ఉన్న సరుకును వెలికి తీయాలి. రైతులకు సరసమైన ధరకు యూరియాను అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.
రెడ్డిపల్లి అప్పలరాజు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

బస్తా యూరియానే ఇచ్చారు



నాకు మూడు ఎకరాల పొలం మీద ఒకటే పాస్‌బుక్ ఉంది. దీంతో ఒక్క యూరియా బస్తానే ఇస్తున్నారు. మిగిలిన యూరియా బయట కొనుక్కోవల్సి వస్తుంది.
–జి వీర ప్రసన్న, రైతు, తుమ్మపాల

స్టాక్ లేదంట!



రైతు సేవా కేంద్రాలకు పని మానుకొని తిరగాల్సి వస్తుంది. ముందుగా కొంత మందికే టోకెన్లు ఇస్తున్నారు. మిగిలిన వారికి మరలా రమ్మంటున్నారు. మరసటి రోజు వస్తే స్టాక్ అయిపోయింది అంటున్నారు. ఒక బస్తా కోసం పదిసార్లు తిరగాల్సి వస్తుంది. – పి.వి. రమణ, రైతు తుమ్మపాల

సామాజిక సేవా కార్యక్రమాలతో మన్ననలు

అనకాపల్లి: ప్రతి ఒక్కరూ జన్మదిన వేడుకలకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి మన్ననలను పొందాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్‌రాజా కోరారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ మహిళా విభాగం సీనియర్ నాయకురాలు కాండ్రేగుల హైమావతి, రమణబాబు దంపతులు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కొణతాల మురళీకృష్ణ, బొడ్డేడ శివ, పీడీ గాంధీ, సిద్ధార్థ, పెంటకోట శ్రీను, సీటపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, తగరంపూడి సూకరత్నం, నీలకంఠం లక్ష్మి, పెట్ల నాగేశ్వరరావు, మారిశెట్టి శ్రీను, శ్యామ్, గైపూర్ రాజు పాల్గొన్నారు.



రోగులకు రొట్టెలు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న మలసాల కుమార్‌రాజా, పార్టీ శ్రేణులు

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ శ్రావణి తెలిపారు. మండలంలోని మారేడిపూడి, కొప్పాక జంక్షన్‌లలో జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లను ఆమె సోమవారం జాతీయ రహదారి భద్రత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే జంక్షన్‌ల వద్ద ఆయా ప్రాంతాలను గుర్తించే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతీయ రహదారిపై నిర్దేశించిన వేగాన్ని అతిక్రమించకుండా వాహనదారులందరూ ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐలు అశోక్ కుమార్, అల్లు స్వామి నాయుడు, ఎస్ఐ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రావణి

వీధివీధినా వినాయక మండపాలు



ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న భారీ వినాయకుడి విగ్రహం



నాలుగు రోడ్ల జంక్షన్‌లో అమ్మకానికి సిద్ధంగా మట్టి గణపతి విగ్రహాలు



కశింకోటలోని సంతబయల గణేష్ రంగుల, మట్టి విగ్రహాల విక్రయాలు

అనకాపల్లి టౌన్: వినాయక చవితి ఉత్సవాలకు ఊరూవాడా సిద్ధమవుతోంది. ఈ మేరకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రతీ వీధిలో మండపాలను, పందిర్లు నిర్మిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఈ ఏడాది వంద అడుగులకుపైనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వేల్పులవీధిలో 30 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నారు. గవరపాలెం పార్కు సెంటర్, నిదానందొడ్డి, గాంధీనగరం, మళ్లవీధి, నర్సింగరావు పేట, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు ఇలా ప్రతీ వీధిలో వినాయక పందిర్లను ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని ప్రదేశాలలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు ఏర్పాటు చేస్తుండగా, ఈ ఏడాది అత్యధికంగా మట్టితో చేసిన గణపతులను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు చెపుతున్నారు.

సైజును బట్టి వినాయక ప్రతిమ ధర...

విఘ్నాలు తొలగించే వినాయకుడి పూజకు ఉత్సవ కమిటీలు వివిధ రూపాల్లో ప్రతిమలను కొనుగోలు చేస్తున్నాయి. సైజును బట్టి రూ.50 మొదలు వందలు, వేల రూపాయలకు విగ్రహాలు అమ్మకాలు జరుగుతున్నాయి.

అమాంతంగా పెరిగిన పూలు, పండ్ల ధరలు

పట్టణంలో మార్కెట్లకు చవితి శోభ సంతరించుకుంది. ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా మెయిన్‌రోడ్ నెహ్రూచౌక్ జంక్షన్, చిననాలుగు రోడ్ల జంక్షన్‌లు పూజా సామగ్రి కొనుగోళ్లతో కోలాహలం నెలకొంది. వివిధ రకాల పండ్లు, పాలవెల్లి, గణపతి విగ్రహాలు అమ్మకాలు జోరుగా సాగాయి. రూ.100కి యాపిల్ పండ్లు నాలుగు, జామకాయలు ఐదు, బత్తాయి ఐదు, దానిమ్మ నాలుగు, వెలగక్కాయలు ఒక్కటి రూ.30, సీతాఫలం చిన్నది రూ.20, వెదురు పాలవెల్లి రూ.20 అమ్మకాలు జరిగాయి. పండగను ఆసరాగా చేసుకొని వా

కశింకోట: స్థానిక సంతబయలలో వినాయక విగ్రహాలు, ప్రతిమల అమ్మకాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 27న గణేష్ చతుర్థి నుంచి ఉత్సవాలు జరగనున్నాయి. దీంతో గ్రామ వీధుల్లోను, ఇళ్లలో వీటిని నెలకొల్పి పూజలు, నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఇందుకోసం ఉత్సవ నిర్వాహకుల ఆర్థిక స్థోమత అనుసరించి వివిధ పరిమాణాల్లో ప్రతిమలు కొనుగోలు చేస్తుంటారు. ఇందుకు అనుగుణంగా రంగులు, మట్టితో వివిధ రూపాలు, ఆకారాలు, పరిమాణంలో తయారైన విగ్రహాలను, బొమ్మలను తెచ్చి విక్రయానికి పెట్టారు. వీటిని పరిమాణం అనుసరించి రూ.50 నుంచి రూ.6,500 వరకు విక్రయిస్తున్నారు.


నేడు రక్తదాన శిబిరం

కశింకోట: స్థానిక కోడికూర రెస్టారెంట్‌పైన శ్రీనివాస ఫంక్షన్ హాలులో మంగళవారం ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగ లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగ గున్నయ్యనాయుడు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భరత్‌కుమార్‌తోపాటు మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, దంతులూరి దిలీప్‌కుమార్, యలమంచిలి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ తదితరులు హాజరు అవుతారన్నారు. భరత్‌కుమార్ అభిమానులు, పార్టీ ప్రతినిధులు, శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కశింకోటలో చిత్తడి వర్షం

కశింకోట: మండలంలో సోమవారం సాయంత్రం చిత్తడి వర్షం ప్రారంభమైంది. రాత్రి వరకు ఆగకుండా పడుతూనే ఉంది. దాంతో వీధి రోడ్లు చిత్తడిగా మారాయి. ఇటీవల తుపాను వర్షాల తర్వాత మళ్లీ వర్షాలు కురవలేదు. దీంతో ముమ్మరంగా వరి నాట్లు చేపట్టారు. ఇప్పుడు అల్పపీడనంతో భారీ వర్షాలు కురిస్తే వరినాట్లు పూర్తి కానున్నాయి.

ఘనంగా షిర్డీ సాయినాథ మందిర వార్షికోత్సవం



షిర్డీ సాయినాథుని పూలు, ఆకులతో అందంగా అలంకరణ



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరంలో షిర్డీ సాయినాథ మందిర వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాబాకు జల, క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. నూతన వస్త్రాలు, ఆభరణాలు అలంకరించారు. ఆలయం ప్రాంగణాన్ని పూలు, ఆకులతో అందంగా అలంకరించారు. హోమం నిర్వహించారు. అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తిరుమల వేంకటేశ్వరస్వామి, భూదేవి, శ్రీదేవి, గరుకుమంతుని విగ్రహాలతో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్ ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నం, రాత్రి భారీ అన్న సమారాధన జరిగింది. సాయిబాబాను సాయంత్రం గ్రామంలో పల్లకిలో ఊరేగించారు. రాత్రి ఏకాహం భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖ, గాజువాక, అనకాపల్లికి చెందిన పలు నాట్య బృందాలతో కూచిపూడి, భరత నాట్యం ప్రదర్శించారు. ఇవి ఆహూతులను విశేషంగా అలరించాయి. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ తదితరులు దర్శించారు. సర్పంచ్ గొంతిన నాగరత్నం, మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపీకృష్ణ, ఉగ్గిన రమణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు దాసరి బాబు, పరిశ్రమల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను పూజించాలి

జోనల్ కమిషనర్ చక్రవర్తి



వేల్పులవీధి సర్వకాంబ పార్కు వద్ద మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి



మెయిన్‌రోడ్డులో సీమాంధ్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో మట్టి గణపతులు పంపిణీ



మామిడిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను మాత్రమే పూజించాలని జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి కోరారు. స్థానిక వేల్పులవీధిలో సర్వకామదాంబ పార్కు వద్ద వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి ఆధ్వర్యంలో సోమవారం మట్టి గణపతుల విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విఘ్నాలు తొలగించే వినాయకుడిని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పూజించాలన్నారు. శుద్ధమైన మట్టితో తయారు చేసిన వినాయకున్ని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. చైర్మన్ కుమారస్వామి మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా ఉచితంగా విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జోనల్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో....

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నకోట చెన్నమూర్తి మాట్లాడుతూ ప్రకృతి ఆరాధనకు మరో పేరే వినాయక చవితి అన్నారు. అందుకే మట్టి గణపతి, ఆకులు, పండ్లు, పత్రిలతో పూజిస్తారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రతినిధి సూదికొండ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ చౌక్ జంక్షన్ వద్ద...

దాడి విద్యా సంస్థల ఆధ్వర్యంలో చైర్మన్ దాడి రత్నాకర్ మట్టి గణపతులను పంపిణీ చేశారు. డీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్ఆర్ జమీర్, యు. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మామిడిపాలెంలో....

ఈనెల 27న మట్టి గణపతులను మాత్రమే పూజించాలని మామిడిపాలెం ప్రభుత్వ హైస్కూల్ గ్రీన్ కార్ప్స్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం హెచ్.బి. శ్రీధర్ మాట్లాడుతూ ప్రకృతి రంగులను వాడడం వల్ల నీటిలో, మట్టిలో అనేక విషపూరిత రసాయనాలు విడుదలై ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేస్తాయన్నారు. మట్టి బొమ్మలనే వాడాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని పూజించారు. పూజకు ఆడంబరాలతో కూడిన ప్రతిమలు అవసరం లేదని, మనస్ఫూర్తిగా మట్టి విగ్రహాలను పూజించి మంచి ఫలితం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ కార్ప్స్ ఉపాధ్యాయులు గొంది చినబ్బాయ్, ఈశ్వరబాబు, నాగమణి, నూకేశ్వరరావు, వరప్రసాద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో సిటు జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న పరమేశ్వరరావు

అనకాపల్లి: సీఐటీయూ జిల్లా మహాసభలను వచ్చేనెల 6, 7 తేదీల్లో చోడవరంలో నిర్వహించనున్నట్టు సిటు జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఎస్.వి.పరమేశ్వరరావు చెప్పారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం సిటు విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు రక్షణ కల్పించాలని, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. భారీ వెహికల్స్‌ను అనకాపల్లి సిటీలోకి అనుమతించకపోవడం వల్ల ముఠా కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ని పరిరక్షించవలసిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లా నాయకుడు గంటా శ్రీరామ్ పాల్గొన్నారు.